క్లుప్తంగా

బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గోపీనాథ్‌కు సన్మానం



గుంటూరు వెస్ట్(క్రీడలు): జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పొన్నగంటి చంద్ర గోపీనాథ్‌ను రిటైర్డ్ ఎస్పీ సిహెచ్.చక్రపాణి శుక్రవారం అభినందించారు. ఇటీవల ఖతార్‌లో జరిగిన షటిల్ టోర్నమెంట్ చక్కని ప్రతిభకనబరిచారు. ఈ నేపథ్యంలో ఏపీ కన్నెగంటి హనుమంతు స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తిరుమలశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన కార్యాలయంలో రంజాన్ సందర్భంగా శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తొలుత మత పెద్దలు దువా(ప్రార్థన) నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రంజాన్ పండుగ ప్రతి ఒక్కరి కుటుంబాల్లో ఆనందం నింపాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసంలో నగరంలోని ప్రతి మసీదు వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, తాగునీటి సదుపాయం, వీధి దీపాల ఏర్పాటు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చాలా కాలం అనంతరం జీఎంసీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామని తెలిపారు.

సునీతా విలియమ్స్‌కు అభినందనలు

లక్ష్మీపురం: అంతరిక్ష పరిశోధనలకు, ప్రయోగాలకు మరింత ఊతం ఇచ్చేలా భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ ఆవిష్కరించారని విద్యావేత్త, శాంతా కళాశాల డైరెక్టర్ పి.శ్రీమన్నారాయణ, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం పాల్గొన్నారు.

దంత సంరక్షణపై దృష్టి సారించాలి



గుంటూరు మెడికల్: దంత సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని గుంటూరు జీజీహెచ్ డైక్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.దీప్తి అన్నారు. డైక్ సెంటర్‌లో(జిల్లా సత్వర చికిత్సా కేంద్రంలో) వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక జీవన శైలి వలన ప్రతి ఒక్కరిలో దంత సమస్యలు బాగా పెరిగిపోతున్నాయని వివరించారు. ప్రాథమిక దశలోనే దంత సమస్య గుర్తించి చికిత్స చేయకపోతే దంతాలు తీసివేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రెండు పూటలా బ్రెష్ చేయాలని, ఆహార తీసుకున్న వెంటనే పుక్కిలించి ఊయాలని, ఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు టూత్ బ్రెష్, పేస్ట్‌లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డైక్ సెంటర్ మేనేజర్ పావులూరి నాగశిరీష పాల్గొన్నారు.

12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి

గుంటూరు మెడికల్: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు ప్రభుత్వం విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా హర్షం వ్యక్తం చేశారు. స్థానిక వైద్య కళాశాల ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ప్రతి నెలా ఉద్యోగులకు పెండింగ్ బకాయిలపై షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. 12వ వేతన సవరణ కమిటీని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఐఆర్ 28 శాతం తక్కువ కాకుండా ప్రకటన చేయాలని తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు బిల్లు కూడా చెల్లించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

జీజీహెచ్‌లో 'మీకోసం మేము'

సూపరింటెండెంట్ యశస్వి రమణ



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్‌కు వస్తున్న రోగులు, వారి సహాయకులకు ఆస్పత్రిలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే వారి వద్దకే వెళ్లి పరిష్కరించాలనే లక్ష్యంతో 'మీకోసం మేము' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ యశస్వి రమణ తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో 'మీకోసం మేము' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పతిలో ల్యాబ్ పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు అన్ని ఉచితంగా చేస్తున్నారని, ఎవరైనా డబ్బులు చెల్లించాలని ప్రలోభ పెడితే నమ్మి మోసపోవద్దని చెప్పారు. కొన్ని వైద్య పరీక్షలకు ముఖ్యంగా మెడికల్ బోర్డు ద్వారా మంజూరు చేసే సర్టిఫికెట్‌లకు ఒకవేళ ఎవరైనా డబ్బు అడిగితే రశీదు తప్పనిసరిగా అడిగి తీసుకోవాలని సూచించారు. డబ్బులు తీసుకుని రశీదులు ఇవ్వని పక్షంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ చిన్నం సుధారాణి, బి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రతి ఒక్కరూ డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన కలిగి ఉండాలని డైక్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ రోహిణి రత్నశ్రీ అన్నారు. వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా శుక్రవారం గుంటూరు జీజీహెచ్ జిల్లా సత్వర చికిత్సా కేంద్రం(డైక్)లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భంలోనే డౌన్ సిండ్రోమ్ గుర్తించవచ్చని, తద్వారా వ్యాధితో పిల్లలు జన్మించకుండా కట్టడి చేయవచ్చన్నారు. డైక్ సెంటర్‌లో డౌన్ సిండ్రోమ్ బాధితులకు అన్ని రకాల వైద్య సేవలు, కౌన్సెలింగ్ ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ప్రాథమిక దశలోనే వ్యాధి బాధితులను గుర్తించి చికిత్స అందించడం ద్వారా వారి పనులు వారు చేసుకునేలా చేయవచ్చు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, డాక్టర్ కీర్తి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ టీనా, వైద్య సిబ్బంది కామేశ్వరి, జ్యోతి, నవ్య, ఇమ్రాన్, ప్రతాప్, డైక్ సెంటర్ మేనేజర్ నాగ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఫిర్యాదుల బాక్సు ప్రారంభం

స్థానిక జీజీహెచ్‌కు వచ్చే రోగులు ఏదైనా సమస్య పరిష్కారం కాకపోతే నేరుగా ఫిర్యాదు చేసేందుకు అధికారులు అందుబాటులో లేకపోతే ఫిర్యాదు బాక్స్‌లో వేయవచ్చని హెచ్‌డీఎస్ సభ్యుడు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లో ఫిర్యాదుల బాక్సును ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ జీజీహెచ్‌కు వచ్చే రోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా ఫిర్యాదు చీటిని ఈ ఫిర్యాదు బాక్సులో వేయాలన్నారు. తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ యశస్వి రమణ, డెప్యూటీ సూపరింటెండెంట్ ఉప్పాల శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటర్ సుధారాణి పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులకు సహకరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టామని, నగర ప్రజలు, వ్యాపార సంస్థలు వ్యర్థాలను రోడ్ల పక్కన, డ్రెయిన్లలో వేయకుండా సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనుల కోసం కేటాయించిన కార్మికులు, వాహనాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల వారీగా భవన నిర్మాణ వ్యర్థాలు, చెట్ల కొమ్మలు పలు ప్రాంతాల్లో దీర్ఘకాలంగా ఉన్నాయని, అటువంటి వాటిని ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా తొలగిస్తున్నామని చెప్పారు. ప్రత్యేక డ్రైవ్‌లో రెగ్యులర్‌గా జరిగే పారిశుద్ధ్య పనులకు ఆటంకం లేకుండా రోజువారీ వేతనంపై కార్మికులను, ట్రాక్టర్లు, పొక్లెయిన్‌లను అద్దె ప్రాతిపదికన తీసుకున్నామన్నారు. ఇప్పటికే వార్డుల వారీగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు వాహనాలను, కార్మికులను కేటాయించి సమగ్రంగా వార్డు పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా భవన నిర్మాణ వ్యర్థాలు, డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటు అనంతరం ఉండే వ్యర్థాలు, చెట్ల కొమ్మలు వంటి వాటిని పూర్తిగా తొలగించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో షెడ్యూల్ మేరకు జరిగే పనులను డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేస్తామని, పనులకు ముందు అనంతరం ఫొటోలు, వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ రామారావు, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, కేవీ బ్రహ్మం

గుంటూరు ఎడ్యుకేషన్: దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లడంలో యువత పాత్ర కీలకమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ జిల్లా స్థాయి పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆలోచన దేశాన్ని ప్రగతి పథంలో నడిపే విధంగా ఉండాలని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ దేశం మనకేమిచ్చిందనే కాకుండా మనం దేశానికి ఏమిచ్చామనే ఆలోచన ప్రతి ఒక్క భారతీయునిలో రావాలని చెప్పారు. బీజేపీ అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే ఆలోచన అనే నినాదమే వికసిత్ భారత్ అని చెప్పారు. ఏఎన్‌యూ ప్రొఫెసర్ వి.దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ యువత ఆలోచనలకు పదును పెడితే గొప్ప స్థాయికి వెళ్లవచ్చని చెప్పారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఆర్ఎంవో ఏ శేషగిరి, బి.మల్లికార్జున రావు, డాక్టర్ బి.ఉదయ ప్రకాష్, నెహ్రూ యువకేంద్ర అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, యూత్ పార్లమెంట్ నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అలరించిన తుమ్మల కళాపీఠం సాహిత్య కార్యక్రమాలు



విజేతలకు సత్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై తుమ్మల కళాపీఠం వారి సాహిత్య కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. తుమ్మల కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. పోతన సాహిత్య సమారాధన అంశంపై ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గోనుగుంట్ల వైదేహి, కవి బ్రహ్మ ఏటుకూరి వెంకట నరసయ్య సాహిత్యంపై ప్రముఖ సాహితీవేత్త కవి డాక్టర్ బీరం సుందరరావు ప్రసంగించారు. తుమ్మల కవిత్వంలో సామాజిక చైతన్య స్ఫూర్తి అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి డాక్టర్ టేకుమళ్ళ వెంకటప్పయ్యకు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యం రూ.3 వేలు, తృతీయ బహుమతి బొడ్డపాటి చంద్రశేఖర్‌కు రూ.2 వేలు అందజేసి సత్కరించారు. కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ఉగాది కవితల పోటీల్లో గెలిచిన వారికి నగదు బహుమతులతో సత్కరించారు. కళాపీఠం కార్యదర్శి డాక్టర్ సూర్యదేవర రవికుమార్, పాలక మండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సభ్యులు డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, పి.నాగసుశీల, పారా అశోక్, ఏలూరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు భవన్స్ సాంస్కృతిక, లలిత కళల అకాడమీ ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్‌బంగ్లారోడ్డులోని భారతీయ విద్యా భవన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చరల్ అండ్ ఫైన్‌ఆర్ట్స్‌ను శనివారం ప్రారంభించనున్నట్లు పాఠశాల కమిటీ కార్యదర్శి పి. రామచంద్రరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ విద్యా భవన్స్ ప్రాంగణంలోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి చేతుల మీదుగా అకాడమీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సంగీత, నాట్య, లలిత, జానపద కళల వంటి మన దేశ సంప్రదాయ, సాంస్కృతిక కళలను భావితరాలకు అందజేసి, వాటి వైభవాన్ని, ఔన్నత్యాన్ని తెలియజేయడమే ధ్యేయం సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, ప్రభుత్వ సంగీత నాటక పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.హరిబాబు, నాట్యాచార్యులు డాక్టర్ కాజా సుబ్రహ్మణ్య శాస్త్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆర్టిఫిషియల్స్ ఇంటెలిజెన్స్ టూల్స్‌పై వర్క్‌షాప్



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్రం(జేకేసీ) ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ సంస్థ సహకారంతో ఆర్టిఫిషియల్స్ ఇంటెలిజెన్స్ టూల్స్‌పై రెండు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ పాఠ్యాంశాల ఆధారిత విద్యాబోధనతో పాటు సాంకేతిక నైపుణ్యాలను మెరుగు పర్చి, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా తగిన ఉద్యోగాలను పొందే విధంగా మ్యాజిక్ బస్, ఐబీఎం సహకారంతో విద్యార్థినులకు రెండు రోజులపాటు వర్క్‌షాప్ నిర్వహించినట్లు వివరించారు. ఏఐ టూల్స్‌ను ఉపయోగించుకుని ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు తగిన మెలకువలపై విద్యార్థులకు శిక్షణ కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ సమన్వయకర్త డాక్టర్ కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు యూనిస్‌ఖాన్, కె.అపర్ణ, మ్యాజిక్ బస్ ప్రతినిధులు దిలీప్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

క్యూలెక్స్ ఆడదోమ వల్లే బోధ వ్యాధి

తెనాలిఅర్బన్: క్యూలెక్స్ ఆడదోమ వలన బోధ వ్యాధి వస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. బోధ వ్యాధిగ్రస్తులకు శుక్రవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం వారు పంపిణీ ఫైలేరియా కిట్‌లను ఆమె పంపిణీ చేశారు. తెనాలి పట్టణంలోని ఆరోగ్య కేంద్రాలకు 282 ఫైలేరియా కిట్లను అందజేయడం జరిగిందని, వాటిని సంబంధిత వైద్యాధికారులకు రోగులకు అందజేస్తారని చెప్పారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంకగట పాల్గొన్నారు.

రాష్ట్ర పికిల్ బాల్ పోటీలకు ముగ్గురు ఎంపిక



గుంటూరు వెస్ట్(క్రీడలు): ఈ నెల 21, 22 తేదీల్లో విశాఖలో జరగనున్న రాష్ట్ర పికిల్ బాల్ పోటీలకు పట్టణ క్రీడాకారులు కె.అరుణ్ కుమార్, పి.ఆనంద్ కుమార్, పి.నాగరాజు, జి.చరణ్ కుమార్ ఎంపికయ్యారని వీవీవీ హెల్త్ క్లబ్ డైరెక్టర్ టి.అరుణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా వీరిని ఎంపిక చేసామన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయిలో రాణించాలి



విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులు భావి జీవితంలో ఉన్నతస్థాయిలో రాణించాలని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రథమ సంవత్సర ద్వితీయ సెమిస్టర్ ఫలితాల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో టాపర్లకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. శుక్రవారం అమరావతి రోడ్డులోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు మెరుగైన విద్యాబోధన అందించేందుకు మరింత ఉత్సాహంగా ముందుకు వెళ్లవచ్చునని అన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. ఈసందర్భంగా ఆయా విభాగాల వారీగా తొలి మూడుస్థానాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఎస్ఆర్ఎంవో మెమోరియల్ ఓరియెంటల్ హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పీవీ నాథ్ పేరుతో స్వీడన్‌లో నివసిస్తున్న ఆయన తనయుడు రవి, కోడలు శ్రీలక్ష్మి నగదు బహుమతులు అందజేశారని వివరించారు. ఎంబీఏ విభాగం నుంచి జి.రత్నకుమారి, మొహమ్మద్ జవేరియా, మువ్వల అనూషతో పాటు ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ పి.స్పైలీ గుంటి, జరపాల శిరీషాబాయి, త్రివేణి అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, సహాయాచార్యులు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, అభిలాష్, బి.అనిత పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని సూపర్‌వైజర్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు.

మందుల దుకాణాల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

నగరంపాలెం: జిల్లాలోని పలు ఔషధ(మందులు) దుకాణాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్) బృందం, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మందుల దుర్వినియోగంపై రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో భాగంగా కొనసాగాయి. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్న దుకాణాలను సీజ్ చేశారు. ఈ మేరకు గుంటూరు, తెనాలిలో పలు దుకాణాలను సీజ్ చేయగా, తనిఖీలు కొనసాగుతున్నాయి.

నగరంలో త్వరలో మోడల్ ఫుడ్ కోర్ట్



బ్రాడీపేటలో పర్యటిస్తున్న తాత్కాలిక మేయర్ సజీల, కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే మాధవి

నెహ్రూ నగర్: నగరంలో త్వరలో మోడల్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయనున్నట్లు నగర పాలక సంస్థ తాత్కాలిక మేయర్ షేక్ సజీల తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరంలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు కోసం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు గల్లా మాధవితో కలసి బ్రాడీపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె గుంటూరు నగరంలో మోడల్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని, నగర ప్రజలు ఈ ఫుడ్ ఏర్పాటు వలన ఎంతగానో హర్షిస్తారన్నారు. కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా ఎంతోమంది వీధి వ్యాపారులకు ఉపాధి దొరుకుతుందని చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో విజయవాడ తరహాలో ఫుడ్ కోర్ట్‌ను నగరంలోని బ్రాడీపేట 4వ లైన్ 1వ అడ్డరోడ్డు నుంచి 14వ అడ్డరోడ్డులో ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉగాది లేదా శ్రీరామ నవమి పండుగా దినాల నాటికి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము 3 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటాయని, రుచికరమైన, శుభ్రమైన ఆహారం అందించే వారికే అనుమతులుంటాయన్నారు. దానికి తగిన విధంగా రోడ్డుకిరువైపులా మార్కింగ్ రూట్ మ్యాప్‌లు సిద్ధం చేస్తామన్నారు.

డ్రోన్లతో నిఘా



మంగళగిరి: డ్రోన్ల సహకారంతో అసాంఘిక శక్తుల ఆగడాలను అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మల పాఠశాల, వీజే కళాశాల, ఆత్మకూరు జంక్షన్ వద్ద డ్రోన్ల సహకారంతో ట్రాఫిక్, ప్రమాదాలను సమీక్షించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రోన్ల సహకారంతో ఒకే చోట నుంచి పరిస్థితులను సమీక్షించి, వెంటనే అదుపులోకి తీసుకురావచ్చన్నారు. రూరల్ పరిధిలోని అసాంఘిక శక్తులు, కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ప్రతి రోజు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, పేకాట ఆడినా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సీహెచ్ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు 'బూడిద'పాలు

తాడేపల్లిరూరల్ : కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి బైపాస్ రోడ్డు నుంచి ఎన్టీఆర్ కరకట్ట మీదుగా ఉండవల్లి, రాజధాని గ్రామాలకు వెళ్లే వారికి విజయవాడ వీటీపీఎస్ బూడిద తిప్పలు తప్పడం లేదు. లారీ యజమానులు తమ స్వలాభం కోసం పరిమితికి మించి నిబంధనలకు విరుద్ధంగా లోడ్ చేసుకోవడమే కారణమని ప్రజలు వాపోతున్నారు. తాజాగా గురువారం తెల్లవారుజామున విజయవాడ వీటీపీఎస్ నుంచి రాజధాని గ్రామాల్లోని పలు ప్రాంతాలకు అధిక లోడ్‌తో లారీలు వెళ్తున్నాయి. ఎన్టీఆర్ కరకట్ట, సీతానగరం మధ్య బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జి వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్ వద్దకు ప్రవేశించగానే బ్రిడ్జి భద్రత కోసం నిర్మించి గడ్డర్లు లారీ క్యాబిన్‌పై ఉన్న లోడ్‌కు తగిలి భారీ మొత్తంలో ఆ బూడిద కింద పడింది. ఆ రహదారిలో వచ్చిపోయే వాహనాల వల్ల బూడిద పైకి లేస్తూ ఆ రోడ్డు మొత్తం తెల్లగా మారింది. కార్లలో వెళ్లేవారు ఎలాగోలా ప్రయాణిస్తున్నా, బస్సులు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటీపీఎస్‌లో బొగ్గు కావాల్సిన అనంతరం వచ్చిన బూడిదను రాజధాని పరిధిలోని పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి, స్థలాల ఫిల్లింగ్‌కు వినియోగిస్తున్నారు. ఇక్కడ ఒక్క చోటే కాకుండా ఆ బూడిదలో నీళ్లు కలిపి తీసుకురావడంతో దారి పొడవునా నీళ్లకారి బూడిద రోడ్డుపై పడుతోంది. అనంతరం ఎండకు పైకి లేచిన బూడిదతో వాహన దారులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోడ్డు పక్కనే ఉన్న నివాసాల్లోకి ఆ బూడిద వస్తోందని మహిళలు వాపోతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కరపత్రాలు అందజేస్తున్న మంగళగిరి కమిషనర్ అలీమ్‌బాషా

తాడేపల్లిరూరల్: ప్రతి ఒక్కరు తాము నివాసముంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా అన్నారు. స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో శుక్రవారం నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని చెప్పారు. పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్లపై చెత్తను ఊడ్చి శుభ్రం చేయించారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ఎంటీఎంసీ అదనపు కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఎంటీఎంసీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

28న వైద్యులకు క్విజ్ పోటీలు

గుంటూరు మెడికల్: రేడియాలజీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరు ఐఎంఏ హాలులో ఈనెల 28న అకడమిక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ చిటితోటి కిషోర్‌కుమార్ తెలిపారు. 'ది గమట్ ఆఫ్ బోవెల్ ఇమేజింగ్ ఎకేస్ బేస్డ్ అప్రోచ్ ఫ్రమ్ స్టమక్ టూ యానల్ కెనాల్' అనే అంశంపై అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతారన్నారు. యువ రేడియాలజిస్టులు, పీజీ వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి గెలుపొందిన వారికి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.8 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు నగదు అందిస్తామని వివరించారు.